క్లుప్తంగా

'హామీలు నెరవేర్చే పార్టీకే మద్దతు'

ఎదులాపురం: హామీలు నెరవేర్చే పార్టీకే గ్రామస్తుల మద్దతు ఉంటుందని ఆదిలాబాద్ మండలం భీంసరి ఎంపీటీసీ బిక్కి గంగాధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసినట్లు తెలిపారు. గ్రామానికి వంతెన, సవారీ బంగ్లా షెడ్డు, పాఠశాల నుంచి ఆటోస్టాండ్ వరకు రోడ్డు వేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. హామీలపై స్పష్టమైన వైఖరి తెలియజేస్తేనే మద్దతు ఇస్తామన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

ఇచ్చోడ: చలికాలంలో గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ సూచించారు. శనివారం మండలంలోని దుబార్‌పేట్ గ్రామంలో పర్యటించి గర్భిణులకు జాగ్రత్తలను వివరించారు. పిల్లలకు తల్లిపాలు ఇవ్వడమే శ్రేయస్కారమన్నారు. ఆయన వెంట హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, ఏఎన్‌ఎంలు సుధారాణి, పద్మ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

తాంసి: భీంపూర్ మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. శనివారం నిర్వహించాల్సిన సమావేశానికి సభ్యులు హాజరు కాకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు, అధికారులకు ముందే సమాచారం ఇచ్చినా.. హాజరుకాలేదు. ఎంపీపీ రత్నప్రభ, ఎంపీడీవో శ్రీనివాస్, వ్యవసాయ, వైద్య, అటవీ, పశుసంవర్ధక శాఖ అధికారులు, సర్పంచ్‌లు లింబాజీ, దాదారావ్, గోవింద్‌రావు మాత్రమే హాజరయ్యారు. కొద్దిసేపు వేచి చూసి సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ప్రకటించారు.

చట్టాలపై అవగాహన అవసరం

బోథ్: చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జిల్లా జడ్జి హుస్సేన్ అన్నారు. శనివారం మండలంలోని దన్నూర్(కె) గ్రామంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల నిరోధక చట్టం, మోటారు వాహనాల చట్టం, ఉచిత న్యాయసేవ, ఇతర చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆడెపు హరీష్, కుమ్మరి విజయ్ కుమార్, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ రెడ్డి, ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి, సర్పంచ్ శిరీష, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: బాలికలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని మహిళ సాధికారత మిషన్ కోఆర్డినేటర్ యశోద అన్నారు. శనివారం మండలంలోని అనుకుంట మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాలలో అవగాహన కల్పించారు. లింగ వివక్షత, సమానత్వం, ఫోక్సో చట్టం, బాల్యవివాహాలు, సైబర్ క్రైం చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో మహిళ సాధికారత కేంద్రం సిబ్బంది కోటేశ్వర, కృష్ణవేణి, నిఖిలేశ్వర్, ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుమురం సూరు ఆశయ సాధనకు కృషి చేయాలి

ఉట్నూర్‌రూరల్: కుమురం సూరు ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలబాయి, ఎంపీపీ జైవంత్‌రావులు కోరారు. మండలంలోని గోండుగూడ పరిధిలోని కొలాంగూడలో శనివారం సూరు వర్ధంతిని నిర్వహించారు. సూరు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూరు వారసులు లేతు, కార్యనిర్వాహణ కమిటీ చైర్మన్ మడావి రాజేశ్వర్, వైస్ చైర్మన్ ధర్ము, కుమ్ర రాజు, టేకం భీము, కొలాం సంఘం నాయకులు బాపురావు, ముకుంద్‌రావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు వలసల బాట పట్టారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఐటీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పుర్కబాపురావు, పెందూర్ ప్రభాకర్, కోట్నాక్ రమేశ్, మంగం విషంరావులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

'బీజేపీలోనే కొనసాగుతా'

ఆదిలాబాద్: బీజేపీలోనే కొనసాగుతానని మాజీ ఎంపీటీసీ సంతోష్ అన్నారు. కేఆర్కే కాలనీలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజల కోరిక మేరకు బీజేపీలో చేరానని, శుక్రవారం ఎమ్మెల్యే రామన్న స్నేహపూర్వకంగా బీఆర్‌ఎస్ కండువాను కప్పారన్నారు. పార్టీ మారానని చేస్తున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదన్నారు.

సన్మానం

ఆదిలాబాద్: గత ఏడాది ఆన్‌లైన్‌లో నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీల్లో మహిషాసుర మర్దిని నృత్యంపై నర్తించి పది ప్రపంచ రికార్డులను లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థి దువాస హర్షిని సొంతం చేసుకుంది. దీంతో శనివారం పాఠశాలలో హెచ్‌ఎం జయేంద్ర పటాస్కర్, పాఠశాల యాజమాన్యం, టీచర్లు విద్యార్థినిని సన్మానించారు.

వెచ్చని నేస్తాలు..

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- పెరుగుతున్న చలి తీవ్రత
- ఉన్ని దుస్తులకు గిరాకీ..





చిన్నారుల క్యాప్‌లు

ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతుండడంతో చలి తీవ్రత పెరుగుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పొగ మంచు కురుస్తుంది. ప్రజలు చలి నుంచి రక్షణ కోసం ఉన్ని దుస్తులను ఆశ్రయిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని రామ్‌లీలా మైదానం, ఎన్టీఆర్ చౌక్, గర్ల్స్ హైస్కూల్‌ల వద్ద స్వెటర్లు, దుప్పట్ల దుకాణాలు వెలిశాయి. చిన్నారులు, పెద్దల కోసం జాకెట్లు, స్వెటర్లు, జర్కిన్లు, మంకీ క్యాప్స్, జాకెట్లు, దుప్పట్లు విక్రయిస్తున్నారు.
– ఆదిలాబాద్

అందుబాటు ధరల్లో..

ఉన్ని దుస్తులు వివిధ మోడళ్లలో అందుబాటులో ఉంటున్నాయి. చిన్నారులు, స్త్రీలు, పురుషులకు ప్రత్యేకంగా డిజైన్ చేసిన వాటిని కొనుగోలు చేసేందుకు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. స్వెటర్లు 300 నుంచి 1000 రూపాయల వరకు లభిస్తుండగా, పెద్దలకు రూ 350 నుంచి రూ. 2000 ధరల్లో లభ్యమవుతున్నాయి.



వివిధ మోడళ్లు..



కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా స్వెటర్లను అమ్మకానికి తీసుకొచ్చాం. ధరలు కూడా రూ.300 నుంచి రూ.500 వరకు ఉన్నాయి. చిన్నారుల నుంచి మొదలుకుని ముసలివారి వరకు సంబంధించి స్వెటర్లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం గిరాకీలు తక్కువగా ఉన్నప్పటికీ, రాబోయే రోజుల్లో పెరిగే అవకాశం ఉంది.
– అఫ్జల్‌ఖాన్, ఆదిలాబాద్

ఎమ్మెల్యేగా ఒకసారి అవకాశం ఇవ్వండి

బేల: ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్ కోరారు. శనివారం మండలంలోని డోప్టాల, షంషాబాద్, కాప్సి(బి), టాక్లీ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే జోగు రామన్న ఆదిలాబాద్ అభివృద్ధి పేరుతో అనేక అక్రమాలు, అవినీతికి పాల్పడిండని ఆరోపించారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా.. ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, నాయకులు బోనిగివార్ గణేష్, రామెల్లి మోరేశ్వర్, ధర్నే జీవన్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న పాయల్ శంకర్

బీజేపీతోనే బీసీలకు న్యాయం

ఆదిలాబాద్: బీజేపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని ఆదిలాబాద్ బీజేపీ అభ్యర్థి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. గౌడ సంఘానికి చెందిన పలువురు నాయకులు బీజేపీకి మద్దతుగా శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పాయల్ శంకర్ మాట్లాడారు. బీజేపీ మినహా మిగితా పార్టీలు బీసీలను విస్మరించాయని మండిపడ్డారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రఘుపతి, బీజేపీ నాయకులు నగేశ్, జ్యోతి, సంఘం నాయకులు సాయిచరణ్ గౌడ్, శివగౌడ్, రాజేశ్వర్ గౌడ్, నవీన్ గౌడ్, కార్తీక్‌గౌడ్ పాల్గొన్నారు.

పార్టీలో చేరికలు

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆదిలాబాద్ బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం టీడీపీకి చెందిన నాయకులు బీజేపీలో చేరారు. వారికి బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుతో కలిసి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదిలాబాద్‌లో జరుగుతున్న అవినీతిని ఐకమత్యంగా ఎదుర్కొవాలన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

కైలాస్‌నగర్: కాంగ్రెస్ గెలిచిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని కంది శ్రీనివాస్‌రెడ్డి సతీమణి సాయిమౌనారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని జై జవాన్‌నగర్, మహాలక్ష్మివాడ, చిల్కూరి లక్ష్మీనగర్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. ఆరు గ్యారంటీ కరపత్రాలను పంచుతూ చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆదిలాబాద్ ప్రజలే జీవితమనుకుని తన భర్త ఇక్కడకు వచ్చాడన్నారు. మహాలక్ష్మి వాడకు చెందిన మాజీ కౌన్సిలర్ కుసుమ లింగారెడ్డి దంపతులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంటరీ పరిశీలకురాలు శాంతి కుమారి, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్దన్ రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, మాజీ డీసీసీబీ అధ్యక్షుడు ముడుపు దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఓటు అభ్యర్థిస్తున్న సాయిమౌనారెడ్డి

ఎదులాపురం: ఆదిలాబాద్ నియోజకవర్గంలో కంది శ్రీనివాస్‌రెడ్డి గెలుపు ఖాయమని నాయకులు గిమ్మ సంతోశ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఆయనపై అనవసర ఆరోపణలు చేయడం బీఆర్‌ఎస్ నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. సమావేశంలో నాయకులు భూపెల్లి శ్రీధర్, సెడ్మకి ఆనందరావు, ఓసవార్ సురేశ్, గౌతం, శ్రీరాం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తే మహిళలకు ఉచిత ప్రయాణం

తలమడుగు: కాంగ్రెస్‌ను గెలిపిస్తే మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించడం జరుగుతుందని జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బరంపూర్ పరిధిలోని మదనాపూర్, నందిగామ, కొలంగూడ, నర్సాపూర్, గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. అలాగే రూ. 500కే గ్యాస్ సిలిండర్, రైతులకు ఎకరానికి రైతుబంధు రూ. 15000 అందించడం జరుగుతుందన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కల్యాణం రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బాబన్న, ప్రకాష్ రావు, పెందుర్ దివ్య మాధవ్, సోమన్న, వెంకన్న యాదవ్, సర్పంచ్ రఘు, గంగారం, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి

కాంగ్రెస్‌ను చూసి భయపడుతున్నారు

బోథ్: కాంగ్రెస్‌ను చూసి బీఆర్‌ఎస్ నాయకులు భయపడుతున్నారని నాయకులు శ్రీకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సల్ల రవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మాట్లాడారు. కాంగ్రెస్ నుంచి పదిమంది కూడా బీఆర్‌ఎస్‌లోకి వెళ్లలేదని, 500 మంది వెళ్లినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వన్నెల అశోక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బూర్గుల మల్లేష్, సీనియర్ నాయకులు మల్లేపూల సత్యనారాయణ, రిజ్వాన్, రహీమొద్దీన్, గంగాధర్, సురేందర్, గంగయ్య, భోజన్న, జాకీర్ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలి'

ఇంద్రవెల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం అన్నారు. శనివారం మండలంలోని బొడ్డిగూడ, ఈశ్వర్‌నగర్, వాగాయితండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. అధికారంలో వస్తే రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు జహీర్, సుర కొమురయ్య, జితేందర్, సోమసే వెంకట్‌రావ్, మీర్జా యాకుబ్‌బేగ్, భగవాన్ పాల్గొన్నారు.

మహాసభ విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: హైదరాబాద్‌లో ఈనెల 11న నిర్వహించే మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు కాంబ్లే బాలాజీ కోరారు. శనివారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో సభకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు తక్షణమే చట్టబద్ధత కల్పించాలని కోరుతూ పరేడ్‌గ్రౌండ్‌లో మధ్యాహ్నం 12 గంటలకు సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆత్మరాం, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెపెల్లి మల్లేశ్ పిలుపునిచ్చారు. శనివారం అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని ఉద్యమాలు చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు జిల్లపల్లి నవీన్ మాదిగ, గైక్వాడ్ సూర్యకాంత్, నాతరి రాజు, మహేశ్, కొమ్ము రవి, ప్రశాంత్, ప్రసాద్ పాల్గొన్నారు.

'యువతకు ఉపాధి కాంగ్రెస్‌తోనే సాధ్యం'

గుడిహత్నూర్: కాంగ్రెస్‌తోనే యువతకు ఉపాధి కల్పన సాధ్యమవుతుందని జిల్లా సీనియర్ నాయకులు అంకతి రవీందర్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలాజీ సోంటక్కే అన్నారు. శనివారం మండలంలోని కొల్హారిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా పని చేయాలన్నారు. గ్రామానికి సుమారు 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ససానే మాధవ్, కొల్హారి వినోద్, చట్ల మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో జానపద గాయకురాలు మృతి

తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి (టి) గ్రామానికి చెందిన జానపద గాయకురాలు వెట్టి దేవుబాయి(60) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె అధికంగా పండరి, తుక్ డాజీ, బాజీరావు మహరాజ్ భజన కీర్తనలు ఆలపిస్తూ భక్తులను అలరించేది. అందరితో కలివిడిగా ఉండే జానపద కళాకారిణి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జీవాలకు టీకాలు వేయించాలి

తలమడుగు: ప్రతీ గ్రామంలో గొర్రెలకు, మేకలకు పీపీఆర్ టీకాలు వేయించాలని పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామారావు అన్నారు. శనివారం మండలంలోని భరంపుర్‌లో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 20 వరకు అన్ని గ్రామాల్లో సిబ్బంది వచ్చి టీకాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగిరథబాయి, మహేశ్, మండల పశువైద్యాధికారి దుద్‌రాం రాథోడ్, సిబ్బంది సౌమ్య, స్వామి, అమీన్, గోపాల మిత్రులు పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న రామారావు

ఘనంగా బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఆదిలాబాద్/తాంసి: జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో శనివారం బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ఆడిపాడారు. శాంతినగర్ కాలనీలో ఎమ్మెల్యే జోగురామన్న సతీమణి జోగు రమాదేవి పాల్గొన్నారు. అలాగే తాంసి మండలంలోని అర్లి(టి) ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. బతుకమ్మ పాటలకు విద్యార్థులు చేసిన నృత్యం ఆకట్టుకుంది.



పూజలు చేస్తున్న మహిళలు

అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్న
- రోడ్డు షోను అడ్డుకున్న పార్డి(బి) గ్రామస్తులు

జైనథ్: అన్నిరంగాల్లో తెలంగాణ అభివృద్ధి చెందిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం జైనథ్ మండలం పార్డి(బి), పార్డి(కే), మేడిగూడ, జామ్ని, మార్గూడ, బేల మండలంలోని దుబ్బగూడ, కారా, తల్తైతండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ముందుకు పోతున్నారని తెలిపారు. రోడ్ షోను పార్డి(బి) గ్రామంలో సర్పంచ్ అస్టక్ ఉజ్వల సుభాష్, గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ గ్రామానికి వంతెన నిర్మించకుండా ఓట్లు ఎలా అడుగుతున్నారని ప్రశ్నించారు. గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని మండిపడ్డారు. పార్డి(కే) గ్రామంలో యువతులతో కోలాటం ఆడారు. ఎమ్మెల్యే వెంట నాయకులు తుమ్మల వెంకట్ రెడ్డి, మార్శెట్టి గోవర్ధన్, సర్పన్ లింగారెడ్డి, పెందూర్ దేవన్న, తదితరులు పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

ఆదిలాబాద్‌రూరల్: బీఆర్‌ఎస్‌తోనే ప్రజల అభివృద్ధి సాధ్యమని మావల మండల బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నల్ల రాజేశ్వర్ అన్నారు. కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే జోగు రామన్నను గెలిపించాలని శనివారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాగం గోవర్ధన్, సుధీర్, అభిమాన్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా బీఆర్‌ఎస్ ప్రచారం

ఎదులాపురం: పట్టణంలోని వార్డు నం.11 రాంనగర్‌లో బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. గడప గడపకు వెళ్లి బీఆర్‌ఎస్ మేనిఫెస్టో వివరించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు సోమన్న, ప్రశాంత్ రెడ్డి, ఇంతియాజ్, సిద్ధార్థ, అశోక్, గంగన్న, పటాడే రాజు, రెహమాన్, ఖలీం పాల్గొన్నారు.

యువత సంక్షేమానికి పెద్దపీట

ఆదిలాబాద్‌టౌన్: అభివృద్ధిని చూసి యువత బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో యువకులు బీఆర్‌ఎస్ చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఉందని, పారిశ్రామిక విధానాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కౌన్సిలర్ ప్రకాష్, కొండ గణేష్, దమ్మపాల్, రాం కుమార్, గణేష్ పాల్గొన్నారు.

'ఆదరించండి.. అభివృద్ధి చేస్తా'



మహిళలతో మాట్లాడుతున్న అనిల్ జాదవ్



ప్రచారం చేస్తున్న ఎంపీపీ రాథోడ్ సజన్

బోథ్: ఈఎన్నికల్లో ఆదరిస్తే బోథ్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. శనివారం కౌఠ(బి), ధన్నూర్, కుచులాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలే భరోసా

నేరడిగొండ: సంక్షేమ పథకాలు పేదలకు భరోసాగా నిలిచాయని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. మండలంలోని కొర్టికల్ (కె), లింగట్ల, ఆరెపల్లి గ్రామాల్లో శనివారం ఇంటింటా ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, నాయకులు గాదె శంకర్, ఉప్పు పోశెట్టి, జనార్దన్, సురేందర్, విశాల్, నారాయణ, శ్రీకాంత్, అశోక్ పాల్గొన్నారు.

తాంసి: బీఆర్‌ఎస్ హయాంలోనే సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని, రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని మండల కన్వీనర్ అరుణ్ కోరారు. శనివారం మండలంలోని పొన్నారిలో ప్రచారం నిర్వహించారు. అనిల్ జాదవ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్ రెడ్డి, అండే అశోక్, కేశవ్ రెడ్డి, ఆనంద్, రజనీకాంత్ రెడ్డి, రఘు, కృష్ణారెడ్డి, రమణ పాల్గొన్నారు.

అనిల్‌జాదవ్‌ను గెలిపిస్తాం

ఇచ్చోడ: బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని ముఖరా(బి) గ్రామస్తులు స్పష్టం చేశారు. శనివారం ఈసందర్భంగా అనిల్‌జాదవ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అన్నివర్గాల ప్రజలకు పథకాలను అందచేసి న్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోస పోవద్దన్నారు. కార్యక్రమంలో ముఖరా(బి) ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

బోథ్: మండల కేంద్రానికి చెందిన పంజేషా యూత్ యువకులు శనివారం బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అన్నికులాల, మతాల అభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచ్ సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆశమ్మపై సస్పెన్షన్ ఎత్తివేత

ఆదిలాబాద్‌టౌన్: పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మపై సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జోగు రామన్న తెలిపారు. సస్పెన్షన్ ఎత్తివేసి, పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమె రాకతో పార్టీకి బలం చేకూరుతుందన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899